క్లుప్తంగా

వైభవంగా ముత్యాలమ్మ జాతర

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవ వేడుకలు సోమవారం ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో ఎంతో వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామ దేవత ఇంద్రపల్లి అమ్మవారికి పూర్వం నుంచి ఒక ఆచారంగా రెండు సంవత్సరాలకు ఒకసారి ముత్యాలమ్మ జాతరకు కులమతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు తమ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్ఐ ఎం.ఆంజనేయులు తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం



రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామ వ్యవసాయ సహాయకులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం పొందిన గొట్టం లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ రైతు సంఘం అధ్యక్షులు కేవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మిట్టగుడిపాడు గ్రామంలోని లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు. లక్ష్మారెడ్డి కుటుంబంలో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించే విషయంలో చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల కోశాధికారి గిద్దల ఆంజనేయులు, ఉద్యాన సహాయకులు డి.శంకర్, ఎం.పవన్, వ్యవసాయ సహాయకులు గొంటు కృష్ణారెడ్డి, ప్రసన్న, జగన్, సతీష్ తదితరులున్నారు.

అధిక ఫీజుల దోపిడీలను అరికట్టాలి

ఎం సీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో స్కూల్, కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని దీనిని అరికట్టాలని ఎం సీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ అన్నారు. పట్టణంలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో ఏ పాఠశాల కూడా విద్యా హక్కు చట్టం నియమ నిబంధనలను పాటించటం లేదని, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, బ్యాగులు, బెల్టులు, షూ పేరుతో అధికంగా వసూలు చేస్తున్నారని తెలియజేశారు. ఉన్నతాధికారులు వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



మల్లికార్జునరావు (ఫైల్)

యడ్లపాడు: వ్యక్తి అదృశ్యమైన కేసు యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లింగారావుపాలెం గ్రామానికి చెందిన మల్నేని మల్లికార్జునరావు 2022 అక్టోబర్ ఒకటో తేదీన వ్యక్తిగత పనులపై విజయవాడకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య సీతామహాలక్ష్మి 1995లోనే మృతి చెందగా, మల్లికార్జున రావుకు తలకు గతంలో ఓ సర్జరీ చేయడంతో జ్ఞాపక శక్తి కొద్దిగా మందగించింది. ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిన ఆయన పెద్దకుమారుడు మల్నేని రమేష్‌బాబు తండ్రి కనిపించలేదన్న విషయం తెలిసి వీసా సమస్యలతో ఇండియాకు రాలేకపోవడంతో నాటి నుంచి బంధుమిత్రులతో వెతికించడం చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం స్వగ్రామానికి వచ్చిన ఎన్నారై రమేష్ బాబు తన తండ్రి ఆచూకీ కనుగొని తమకు న్యాయం చేయాలంటూ సోమవారం రమేష్ బాబు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెంఘీజ్‌ఖాన్‌పేట ఆలయ భూముల కౌలు వేలం

15.24 ఎకరాలకు రూ.2.89 కౌలు వేలం

యడ్లపాడు: చారిత్రక ప్రాంతమైన చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామంలో వేంచేసి ఉన్న పురాతన ఆలయమైన శ్రీ వెన్నముద్దల వేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన భూములకు అధికారులు కౌలుహక్కు వేలంపాట నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ కౌలువేలం పాట స్థానిక రైతులు పోటీపడ్డారు. 15.24 ఎకరాలకు గతంలో రూ.84,500 కౌలు వేలం నిర్వహించగా తాజా వేలంలో అనూహ్యంగా పెరిగి రూ.2,89,000కు చేరింది. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ఆదేశానుసారంగా ఆలయ అర్చకులు సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చెన్నుపల్లి శివయ్య తెలిపారు.

కేసానుపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

- కొత్తగా మరొక అతిసార కేసు నమోదు
- ఇప్పటికే 16 మంది అతిసార బాధితులు
- హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు
- పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో అతిసార బారిన పడి మహిళ మృతి చెందటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ గ్రామంలో 16కిపైగా అతిసార కేసులు నమోదు కావటంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం కొత్తగా ఒక అతిసార కేసు నమోదు కావటంతో వైద్య శిబిరంలో ప్రాథమిక వైద్య సేవలు అందించి మెరుగైన వైద్య కోసం దాచేపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇప్పటి వరకు అతిసార బారిన పడి పలు ప్రైవేట్, ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారిలో ఐదుగురు ఇళ్లకు చేరుకున్నారు. మిగిలిన బాధితులు చికిత్స పొందుతున్నారు. కొత్త కేసులు నమోదు కాకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు. ఎస్సీ కాలనీలోని చర్చిలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 24 గంటల పాటు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో దండోరా వేయించి మాంస విక్రయాలు కొన్ని రోజుల పాటు నిషేధించినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కేసానుపల్లిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామంలోని మురుగు కాలువల్లో పూడిక తీశారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. మంచినీటి ట్యాంక్‌లు క్లోరినేషన్ చేశారు. మంచినీటిని సరఫరా చేసే పైపులను సైతం శుభ్రం చేస్తున్నారు. ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య, మధు, సర్పంచ్ శ్రీపతి ప్రసాద్, ఎంపీటీసీ చెట్టిపాగు



మెడికల్ క్యాంప్‌లో వైద్య సేవలు అందిస్తున్న గోలి వైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి

ఏసుదాసు, నాయకులు నెల్లూరి రామకోటయ్య, వినుకొండ సుధీర్ తదితరులు గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, బోర్ల ద్వారా వచ్చే నీటిని వినియోగించవద్దని పంచాయతీ అధికారులు చెప్పారు.

రెంటచింతలలో వైద్య శిబిరం ఏర్పాటు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని వడ్డెర బావి సెంటర్‌లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి డయేరియా కేసుల సర్వే చేపట్టినట్లు గోలి వైద్యాధికారి కె.ప్రదీప్‌కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి ఆదేశాల మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి, ఇతర కేసులు ఉంటే గుర్తించి వివరాలు గూగుల్ షీట్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కలుషితమైన నీటిని తాగడం వలన డయేరియా(అతిసార) వస్తుందని, సీజనల్ వ్యాధుల గురించి కాలనీ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. డయేరియా వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో వైద్య సేవలు పొందాలని కోరారు. గ్రామంలో అతిసార వ్యాధి వచ్చిన ప్రాంతాలలో గ్రామ పంచాయతీ పారిశుధ్య పనులను చేపట్టి, సైడ్ కాల్వల్లో నున్న మంచినీటి పైపులను సైడ్ కాల్వల పైభాగాన ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని ఎంపీడీవో, కార్యదర్శులకు సూచించడం జరిగిందన్నారు. మినరల్ వాటర్ తాగమని, పంచాయతీ ట్యాప్ వాటర్‌ను కాచుకుని తాగడం వలన డయేరియా దరి చేరదన్నారు. డయేరియా వచ్చిన ప్రాంతాలలో తాగునీటి నాణ్యత పరీక్ష చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల షాపులలో విస్తృతంగా తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: విత్తనాలు విక్రయించే షాపుల నిర్వాహకులు అనుమతులు లేని విత్తనాలను రైతులకు విక్రయిస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక విత్తనాల షాపులలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. విత్తనాల షాపుల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులు ప్రతి ఏడాది తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి (లైసెన్స్) తీసుకోవాలని సూచించారు. అలాగే అనుమతులు (ప్రభుత్వ గుర్తింపు పొందని కంపెనీల) లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ (ప్రభుత్వం నిర్ణయించిన) ధరలకే విక్రయించాలన్నారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లయితే అటువంటి షాపుల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని ఆ షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అనుమతులు తీసుకోకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలను ఈ ప్రాంతంలో అమ్మడం నేరమన్నారు. రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి కచ్చితంగా బిల్లులు పూర్తి వివరాలతో ఇవ్వాలన్నారు.

228 మందికి క్షయవ్యాధి నివారణ వ్యాక్సిన్

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి



టీబీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో క్షయవ్యాధి (టీబీ) నివారణకు 228 మందికి వ్యాక్సిన్ వేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 11 గ్రామాలలో నున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలలో 60 సంవత్సరాల పైబడిన వారికి, పొగ తాగే వారికి, షుగర్ ఉన్నవారికి, 5 సంవత్సరాల కిందట క్షయ(టీబీ) ఉన్న వారికి.. వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. క్షయ వ్యాధి ఒక అంటువ్యాధి అని ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం మంచిదన్నారు. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినది అయినప్పటికీ చర్మము నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. క్షయవ్యాధి ఉన్న వ్యక్తి దగ్గు, తుమ్ము నుంచి వచ్చే చిన్న చిన్న తుంపర్ల ద్వారా ఈ వ్యాధి సోకుతుందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిమాండుకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయాలి

కారెంపూడి: మండలానికి వచ్చిన పచ్చి రొట్ట విత్తనాలు వచ్చిన రోజునే అయిపోయాయి. రెండు క్వింటాళ్లు మాత్రమే గ్రామానికి రావడంతో ఎదురు చూస్తున్న రైతులు వెంటనే వాటిని తీసుకెళ్లారు. మండలంలో ఒప్పిచర్ల, నరమాలపాడు, గాదెవారిపల్లె, పెదకొదమగుండ్ల ఆర్బీకేలకు వచ్చిన విత్తనాలను రైతులు వెంటనే తీసుకెళ్లారు. కావాల్సిన రైతులు మళ్లీ విత్తనాలు ఎప్పుడు వస్తాయని అడుగుతున్నారు. మిగిలిన 11 గ్రామాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తొలకరిలో మాగాణి భూముల్లో భూసారం పెంచుకోవడం కోసం పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం ఆనవాయితీగా వస్తోంది. వాస్తవానికి మే 15వ తేదీ నాటికే విత్తనాలు రావడం జరిగేది. కానీ సార్వత్రిక ఎన్నికలు, అనంతరం తలెత్తిన ఘటనల నేపథ్యంలో చాలా కాలం కొనసాగిన 144 సెక్షన్ కారణంగా పచ్చిరొట్ట విత్తనాల ఇండెంట్‌లను వ్యవసాయ శాఖ అధికారులు లేటుగా పెట్టారని తెలుస్తోంది. వాస్తవానికి ఒక్కో ఆర్బీకే సెంటర్‌కు మూడు టన్నుల పచ్చి రొట్ట విత్తనాలు అవసరం కాగా ఇప్పటికి రెండు క్వింటాళ్లు చొప్పున మాత్రమే రావడం వల్ల కొరత ఏర్పడింది. రైతులు వాటి కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. డిమాండుకు తగినట్టు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, పిల్లిపెసర, జనుము పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్‌లో వరి సాగుకు సిద్ధం అవుతున్న రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తారు. బోర్ల కింద కూడా వరి సాగు చేయడానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు. భూమిని దున్నుకొని పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడానికి విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

అర్హులందరికీ సాగుదారు హక్కు పత్రాలు

తహసీల్దార్ ప్రసాద్



పాపాయపాలెంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

బెల్లంకొండ: భూ యజమానుల హక్కులకు భంగం కలుగకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు అర్హులైన రైతులందరికీ జారీ చేయబడతాయని తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని మాచాయపాలెం, పాపాయపాలెం గ్రామాలలో పంట సాగుదారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు పంట సాగుచేయు సాగుదారులకు సహకరించాలని సూచించారు. వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామంలో కౌలుకు సాగు చేయు రైతులందరు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలని అందుకు గాను భూ యజమాని ఆధార్, సాగుదారు ఆధార్, మొబైల్ నంబర్‌తో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పంట నమోదు తద్వారా పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు పొందుటకు, పంట బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలు సంభవిస్తే పంట నష్ట పరిహారం, రైతు భరోసా తదితర ప్రభుత్వ పథకాలు పొందుటకు ఈ హక్కు పత్రాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామనబోయిన ఆదిగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పవన్ కుమార్, శాస్త్రి, శ్రీనివాసరావు, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఉల్లంగుంట ప్రత్యూష, మాటూరి వంశీ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కుటుంబానికి ఆర్థిక సహాయం



మాచర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు దొడ్డా శ్రీనివాసరావు కుటుంబాన్ని జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు, టీడీపీ నాయకులు సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆరు నెలలకు సరిపడా సరుకులు, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణంలోని 24వ వార్డులో నివాసం ఉండే డి.శ్రీనివాసరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శ్రీనివాసరావు కుటుంబానికి టీడీపీ నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్, గాయత్రి పెయింటర్స్ కాశిరెడ్డిల సహకారంతో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామమూర్తి, నాయకులు గణేష్, ఓరుగంటి చెన్నకేశవరావు, ఎం.రాంబాబు ఆధ్వర్యంలో సహాయం అందజేశారు.

ఘనంగా కాశీవిశ్వనాథం స్వామీజీ జన్మదిన వేడుకలు



మాచర్ల: పట్టణంలో పరబ్రహ్మ కాశీవిశ్వనాథం స్వామీజీ జన్మదినోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మానుకొండ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు అనేక మంది పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారు. పరబ్రహ్మ కాశీవిశ్వనాథం స్వామి అనుగ్రహ భాషణ చేశారు. పలువురు స్వామీజీలు, మాతాజీలు, పీఠాధిపతులు పాల్గొన్నారు. గురుస్వామి పందిరి శ్రీశైలం మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం గుల్లపాడు గ్రామం నుంచి భక్తులు స్వామీజీకి పలు సేవలు అందించారన్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈవో బాల సుందరరావు



బెల్లంకొండలో విద్యార్థికి కిట్ అందిస్తున్న ఎంఈవో, నాయకులు

బెల్లంకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో బాలసుందరరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బడి బయట విద్యార్థులు, నూతన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. అనంతరం పాఠశాలలో 1, 2 తరగతి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బెల్ట్, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు పీఎస్కే మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సదుపాయం ఉపయోగించుకుని ప్రతి విద్యార్థి మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంషాద్ బేగం, వైస్ సర్పంచ్ జానీ, మల్లారెడ్డి, సీఆర్పీ నరసింహారావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయండి

ఈపూరు: పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారి రామినీడి రామారావు తెలిపారు. మండలంలోని గుండేపల్లి, వనికుంట గ్రామాల్లో కౌలుదారులకు పంటసాగు హక్కు పత్రం–ఉపయోగాల గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు సాగు చేసుకునే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలురైతు కార్డును పొందాలన్నారు. ఈ కార్డు వలన సాగు చేసిన పంటల నమోదు, అకారణంగా కురిసే వర్షాల వల్ల పంట నష్టపరిహారం, రైతులకు అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల్లో పొందేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, సర్పంచ్‌లు కాసరగడ్డ మల్లికార్జున్, బచ్చనబోయిన వెంకట సుబ్బయ్య, వీఆర్వో నాసర్ సాహెబ్, వీఆర్‌ఏ వెంకటేష్, వీఏఏ ఆనంద్ బాబు, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు కచ్చితంగా ఈకేవైసీ, సేఫ్టీ చెకప్ చేయించుకోవాలని వినుకొండ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సయ్యద్ సలీం తెలిపారు. 5 సంవత్సరాల పైబడి కాలం చెల్లిన సురక్ష పైపులను ఏజెన్సీ సిబ్బంది వద్ద మార్చుకోవాలని సూచించారు. ఈకేవైసీకి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని, పైపుకు రూ.190 చెల్లించాలన్నారు.

వైభవంగా కోదండ రామాలయ తొలి వార్షికోత్సవం

గణపవరంలో మార్మోగిన శ్రీరామనామం



కల్యాణమూర్తులుగా స్వామివార్లు

ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన శ్రీ కోదండ రామాలయం తొలి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారులు దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ శర్మలు స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గ్రామంలో సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన కోదండ రామాలయం శిథిలావస్థకు చేరడంతో, 2015లో దీని స్థానంలో గ్రామస్తులు నూతన ఆలయం నిర్మించారు. 2023 జూన్ 7న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే విగ్రహం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు.

సోమవారం ఉదయం యాగశాలలో శాంతి హోమాలు నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి, అనంతరం స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కల్యాణ మహోత్సవం జరిగింది. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడింది. ఆలయ తొలి వార్షికోత్సవానికి శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామిశిష్యులైన గుదిమెళ్ళ శ్రీ కూర్మనాథ స్వామి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మీ గ్రూపు సంస్థల కార్యదర్శి పేర్ని వీరనారాయణ, ఎంఎల్ అండ్ కో కంపెనీ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, సీఆర్ కళాశాల పాలక మండలి అధ్యక్షుడు చుండి విజయసారథి, కేతినేని శ్రీహరిరావు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆ మలుపు.. యమ డేంజర్

- ప్రమాదాలకు నిలయంగా మారిన మూలమలుపులు
- రెండు నెలల్లో ఆరుగురు పైగా మృతి





భైరవునిపాడు గ్రామ శివారులో ప్రమాదకరంగా మారిన మలుపులు

మాచర్ల రూరల్: ఆ మలుపుల రహదారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. జాతీయ రహదారి కావటంతో మితిమీరిన వేగంతో పయనిస్తూ మూల మలుపుల రోడ్డును అంచనా వేయలేక అదుపుతప్పి తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. మాచర్ల మండల పరిధిలోని తాళ్ళపల్లి, భైరవునిపాడు, కొత్తపల్లి జంక్షన్ పరిధిలోని హైరోడ్డులో గత రెండు నెలలుగా ద్విచక్ర వాహనాలు, కారు, ఆటో, ట్రాక్టర్లు ఢీ కొని ఆరుగురికి పైగా మృతి చెందారు. అలాగే తీవ్ర గాయాలతో 8 మందికి పైగా ఆసుపత్రిలో చికిత్స పొందిన ఘటనలున్నాయి. జూన్ 6న తెలంగాణ రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనంపై మాచర్ల వస్తున్న కుర్రా నాయక్, వెంకటేశ్వర్లు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మలుపులో రోడ్డు పై పడి అక్కడికక్కడే మృతి చెందారు. జూన్ 9వ తేదీన కారు ద్విచక్ర వాహనం ఢీ కొని పల్లపోలు లోకేష్ రెడ్డి, నర్సరాజు, కొత్తపల్లి జంక్షన్ పెట్రోల్ బంకు వద్ద ట్రాక్టర్‌ను ఢీ కొని నీలం శివ మృతి చెందాడు. అలాగే తాళ్ళపల్లి, 7వ మైలు వద్ద ఆటో ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు నీలం శివ మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడిన ఘటన నెలకొంది. మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో పాటు తెలంగాణ నుంచి మద్యం సేవిస్తూ వాహనాలు నడపటం వలన ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు భావిస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి మాచర్ల వరకు నేషనల్ హైవేపై వారంలో కనీసం ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖాధికారులు, పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వటంతో పాటు హెల్మెట్ లేకుండా వెళ్లే వారిని ఆపి వారికి జరిమానా విధించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేయాలని, మూల మలుపుల వద్ద బ్లింకింగ్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మృతిచెందిన లోకేష్‌రెడ్డి (ఫైల్)



దెబ్బతిన్న బైకు (ఫైల్ ఫొటో)

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థుల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు

చిలకలూరిపేట: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పోటు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విద్యా ప్రవేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుకై విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ భాగస్వామ్యం వహించాలని కోరారు. బాల్యంలో చదువుపొందే హక్కు ప్రతి చిన్నారికి ఉందని పేర్కొన్నారు. దానిని పిల్లల తల్లిదండ్రులు హరించకూడదని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు తల్లికి వందనం ద్వారా నగదు అందజేత, ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు, ఇంగ్లిషు మీడియం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.